నేటికీ అందని పాఠ్య పుస్తకాలు

- మాటలు ఘనం.. చేతలు విఫలం
- యూనిఫాం ఇచ్చేదెన్నడో ?


నూజివీడు ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లోని స్టాకు పాయింట్‌లో ఉన్న పాఠ్య పుస్తకాలు

నూజివీడు: పాఠశాలలు తెరిచే రోజునే విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలతో పాటు యూనిఫాం, బ్యాగ్‌లు, షూ, బెల్టులు అందజేస్తామంటూ నెల రోజుల నుంచి పాలకులు ఊదరగొడుగుతున్నారు. వాస్తవంగా మాత్రం మండలంలోని చాలా పాఠశాలలకు నేటికీ పాఠ్య పుస్తకాలు, బ్యాగ్‌లు, యూనిఫాం, షూ, బెల్టులు అందని పరిస్థితి. దీంతో ప్రభుత్వ మాటలు ఘనంగా ఉంటున్నాయే గాని చేతల్లో మాత్రం విఫలమవుతుందని విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాలలు తెరిచి ఆరు రోజులవుతున్నా నూజివీడు పట్టణంతో పాటు మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నేటికీ పాఠ్య పుస్తకాలు అందలేదు. కేవలం యూపీ స్కూల్స్, హైస్కూళ్లలో మాత్రమే పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలను అందజేశారు. పుస్తకాలే కాకుండా బ్యాగ్‌లు, షూలు, బెల్టులు కూడా నేటికీ అందకపోవడం గమనర్హం. పాఠశాలలు తెరిచిన నాడే విద్యార్థుల చేతుల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పెడతామని కూటమి ప్రభుత్వం గొప్పగా చెప్పింది. తీరా చూస్తే ఆ మాటలు నీటి మీద రాతలుగానే మిగిలాయి. నూజివీడు మండలంలో 67 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో దాదాపు 4,500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వకపోవడంతో ఉపాధ్యాయులు ఏం చేయాలో తెలియక కాలక్షేపం చేస్తున్నారు. ఇప్పటికైనా పాఠ్య పుస్తకాలను అందజేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో బడులు తెరిచిన రోజే

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పాఠశాలలు తెరిచిన రోజునే జగనన్న విద్యా కానుక కిట్లను ప్రతి పాఠశాలలోని విద్యార్థులకు అందజేసే వారు. అప్పటి వరకు అందజేసే పాఠ్య పుస్తకాలు, యూనిఫాంకు జతగా రాత పుస్తకాలు, బ్యాగ్, షూ, టై, బెల్టులతో డిక్షనరీలను సైతం అందించారు. సార్వత్రిక ఎన్నికలు వస్తున్నాయని చెప్పి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదనే ఉద్దేశంతో 2024లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుగానే జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీకి చర్యలు తీసుకొంది. దీనిని బట్టే పేద పిల్లల విద్యాభివృద్ధికి వైఎస్ జగన్ ప్రభుత్వం ఎంత శ్రద్ధ తీసుకునేదో చెప్పొచ్చు.


స్టాకు పాయింట్‌లోనే ఉన్న బ్యాగ్‌లు, బెల్టులు

ఈ ఏడాది బై లింగ్వల్

2019కు ముందు ప్రభుత్వం అందజేసే ఉచిత పాఠ్య పుస్తకాలను ఒకే మీడియంలో ముద్రించే వారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం తెలుగు, ఇంగ్లిషు భాషల్లో (బై లింగ్వల్) ముద్రించి విద్యార్థులకు పంపిణీ చేసేది. దీంతో వారికి చదువుకోవడానికి ఎంతో సులువుగా ఉండేది. అర్థం కాని విషయాలను తెలుగు, ఆంగ్ల భాషల్లో చదువుకొని తెలుసుకునే వారు. వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాన్నే ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తోంది.

కొన్ని పుస్తకాలు రావాలి..

ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సంబంధించి ఒకటి, రెండు సబ్జెక్టులు తగ్గాయి. అవి రాగానే అన్నీ కలిపి సెట్ మొత్తం ఒకేసారి అందజేయాలని అనుకున్నాం. ఉన్న పుస్తకాలను పాఠశాలల వారీగా కట్టలు కట్టి సిద్ధంగా ఉంచాం. ఆలస్యమవుతుందనుకుంటే నేటి నుంచి పాఠశాలలకు పంపిస్తాం.

–ఎం.సేవియా, ఎంఈఓ–1, నూజివీడు

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రతి రోజు యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డీఏవీ పాఠశాల ప్రిన్సిపాల్ మన్మోహన్ తెలిపారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా కొండపల్లి డీఏవీ పాఠశాల నుంచి యోగాపై అవగాహన కల్పించేందుకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు బాల్యం నుంచి యోగా సాధన చేయడం ద్వారా ప్రగతికి బాటలు వేసుకోవచ్చన్నారు. విద్యార్థులు మొబైల్స్, యూట్యూబ్ చానల్స్‌కు దూరంగా ఉండి యోగాపై దృష్టి పెట్టాలని సూచించారు. యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. యోగా గురువు లంకే జనార్దన్ మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా ఒత్తిడి దూరమై ఆత్మవిశ్వాసం, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతాయన్నారు. విద్యార్థులతో యోగాభ్యాసం చేయించారు. యోగా చేయండి ఆనందంగా జీవించండి అనే నినాదాలతో ప్లకార్డులు పట్టుకుని వీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కొండపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పారిశుద్ధ్య కార్మికుల యోగాసనాలు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా గుంటుపల్లి డాన్ బాస్కో పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహించిన జిల్లాస్థాయి యోగాసన పోటీలు బుధవారంతో ముగిశాయి. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి విజయవాడలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రధానోత్సవం జరగనుంది. మూడు రోజుల పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు చేసిన యోగా కార్యక్రమాలపై అక్కడ పనిచేసిన పారిశుద్ధ్యం కార్మికులు ఆసక్తి కనబర్చారు. చివరిరోజు పోటీలు ముగిసిన అనంతరం మేము సైతం యోగా చేస్తామని నిర్వాహకులకు తెలపడంతో వారు కార్మికులతో యోగా చేయించారు. కార్మికుల యోగాసనాలపై నిర్వాహకులు ప్రశంసించారు. యోగా జీవితంలో ఒక భాగం చేసుకోవాలని సూచించారు.


గుంటుపల్లిలో యోగాసనాలు వేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

పెరుగుతున్న పామాయిల్ సాగు

చాట్రాయి: తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు వచ్చే పామాయిల్ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. వంట నూనెకు ఉన్న డిమాండ్‌తో పామాయిల్ సాగు విస్తీర్ణం పెరుగుతోంది. మండలంలో మూడేళ్ల క్రితం సుమారు 3,171 ఎకరాల్లో పామాయిల్ సాగు ఉండగా ప్రస్తుతం సుమారు 6,200 ఎకరాలకు పెరిగింది. రానున్న రోజుల్లో ఇంకా పెరగవచ్చని రైతులు చెబుతున్నారు.

పామాయిల్ సాగుకు రాయితీలు

పామాయిల్ సాగు చేసే రైతులకు ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వం యంత్ర పరికరాలు, మినీ ట్రాక్టర్, చాప్ కట్టర్, గెలలు కోసే కత్తులు వంటి పరికరాల్లో 50 శాతం రాయితీ ఇస్తోంది. రైతుకు భూమిలో నీటి వసతి బాగా ఉండి బోరు, విద్యుత్ ఉంటే ఎకరానకు 57 మొక్కలు ఉచితంగా ఇస్తోంది. నాటిన నాలుగేళ్లకు కాపు వస్తుంది. ప్రతి మండలంలో పామాయిల్ కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి రావడంతో వ్యయ ప్రయాసాలు తగ్గుతుండం కూడా సాగు పెరగడానికి ఒక కారణమని రైతులు అంటున్నారు. అంతేగాక అంతర పంటలైన మొక్కజొన్న, పెసర, మినుము గుమ్మడి, కూరగాయల సాగు ద్వారా నాలుగేళ్ల పాటు అదనపు ఆదాయం రైతుకు దక్కుతుంది.

తగ్గుతున్న మామిడి సాగు

పామాయిల్ సాగుకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో మామిడిని తొలగించి రైతులు పామాయిల్ సాగు చేస్తున్నారు. అంతేగాక మామిడి సాగుకు తెగుళ్లు సోకడం, తుఫాన్ల వలన రాలిపోవడం, ఆశించిన ధరలు పలకకపోవడంతో పెట్టిన పెట్టుబడులు రాక మామిడి సాగులో నష్టాలు వస్తుండడంతో రైతులు మామిడి చెట్లను తొలగించి పామాయిల్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

లాభదాయకంగా పామాయిల్ సాగు

పామాయిల్ సాగు లాభదాయకంగా ఉంది. రూ.193 విలువ గల మొక్కను రైతుకు ఉచితంగా ఇస్తున్నాం. ఎరువుల యాజమాన్యానికి ఒక హెక్టార్‌కు రూ.5,250 రాయితీ, అంతర పంటలకు రూ.5,250 రాయితీ ఉద్యాన శాఖ ఇస్తోంది.

–హేమ, ఉద్యాన శాఖాధికారిణి

అర్హులందరికీ ఇళ్ల స్థలాల మంజూరు


ముసునూరులో పర్యటిస్తున్న సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

ముసునూరు: మండల కేంద్రం ముసునూరు, చెక్కపల్లి గ్రామాల్లో నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ సుడిగాలి పర్యటన చేశారు. బుధవారం సాయంత్రం ఆయన రెవెన్యూ అధికారులతో కలిసి ముసునూరు, చెక్కపల్లి గ్రామాల్లోని ఇళ్ల స్థలాల అర్హుల, అనర్హుల జాబితా ప్రకారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయడానికి తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ రమణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

వైభవంగా చండీ యాగం

ధర్మవరప్పాడుతండా(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసిఉన్న తుల్జా భవానీ అమ్మవారి ఐదో వార్షిక మహోత్సవాల్లో భాగంగా చివరి రోజైన బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. హైదరాబాద్‌కు చెందిన అర్చకుడు ఉండి విశ్వతేజ చైతన్యశర్మ ఆధ్వర్యంలో అష్టోత్తర కలశార్చన, పంచామృత సహిత ఫల రసాభిషేకం, చండీ హోమం, పూర్ణాహుతి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పాల్గొని పూజలు చేశారు.

తల్లికి వందనం కోరుతూ ధర్నా



తిరువూరు చీరాల సెంటర్‌లో ధర్నా చేస్తున్న కార్మికులు

తిరువూరు: తమ పిల్లలకు కూడా తల్లికి వందనం పథకం అమలు చేయాలని కోరుతూ తిరువూరు నగర పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు బుధవారం చీరాల సెంటర్‌లో ధర్నా చేశారు. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేసే తమకు అతి తక్కువ వేతనాలు ఇస్తున్నప్పటికీ తెలుపు రేషన్ కార్డు రద్దు చేయడం, సంక్షేమ పథకాలను నిలిపివేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. సాధికార సర్వేలో తమను ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేయడం తగదని పేర్కొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

మహిళను చెట్టుకు కట్టి హింసించడం హేయమైన చర్య

మైలవరం: స్వయానా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గం కుప్పంలో రజక మహిళను చెట్టుకు కట్టి చిత్రహింసలు పెట్టడం హేయమైన చర్య అని, దోషులను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సమైఖ్య రాష్ట్ర అధ్యక్షుడు బుద్దవరపు వెంకట్రావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కుప్పం నియోజకవర్గం నారాయణపురం గ్రామంలో రూ.80 వేలు బాకీ కట్టలేదని శిరీషను చెట్టుకు కట్టి చిత్రహింసలకు గురిచేశారన్నారు. రాష్ట్రంలో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని తెలిపారు.

వేంకటాచలస్వామికి లక్ష మల్లెలార్చన



తిరువూరు: స్థానిక శ్రీవేంకటాచలస్వామి ఆలయంలో బుధవారం జ్యేష్ఠ మాస సందర్భంగా లక్ష మల్లెలతో విశేషార్చన నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు దేవయాజనం వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో వైష్ణవగోష్ఠి భక్తులు మల్లెలతో అర్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నరసింహునికి రూ. 17.57 లక్షల ఆదాయం

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసి ఉన్న యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారికి పలు రకాల వేలం పాటల ద్వారా రూ. 17.57 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో సురేష్‌బాబు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం భూముల కౌలు, తలనీలాల వేలం నిర్వహించారు. వేదాద్రి, బండిపాలెం గ్రామాల్లోని కౌలు భూములకు రూ.2.51 లక్షలు, తలనీలాలు పోగు చేసుకునే హక్కును బాపట్ల జిల్లా చీమకుర్తి గ్రామానికి చెందిన కత్తుల యాదగిరి రూ.15.06 లక్షలకు కైవసం చేసుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ జయప్రకాష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంజాయి కలిగి ఉన్న నలుగురి అరెస్ట్



విస్సన్నపేట: గంజాయి కలిగి ఉన్న నలుగురు వ్యక్తులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు సీఐ గిరిబాబు ఆదేశాలతో స్థానిక రెడ్డిగూడెం రోడ్డులో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉండటంతో వారిని తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, రెవెన్యూ సిబ్బంది సమక్షంలో తనిఖీ చేయగా నలుగురు వ్యక్తుల వద్ద 2 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించినట్లు ఎస్ఐ జి.రామకృష్ణ తెలిపారు. కంకిపాడుకు చెందిన జి.సతీష్, పి.రాకేష్, పి.నాని, నూజివీడుకు చెందిన డి.భువనేశ్వరిలను అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రిటైర్డు ఉపాధ్యాయుడికి సత్కారం



తిరువూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని పెన్షనర్ల అసోసియేషన్ బాపూజీ షెల్టర్ హోమ్‌కు రిటైర్డు ఉపాధ్యాయుడు షేక్ జానీ బుధవారం ప్రింటర్ వితరణ చేశారు. పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్ల ఆన్‌లైన్ డేటా ఎంట్రీ తదితర అవసరాల నిమిత్తం ప్రింటర్‌ను జానీ అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు బీవీ ప్రసాదరావు తెలిపారు. రిటైర్డు ఉద్యోగులు మార్క్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సీడీపీఓగా పిల్లి విజయకుమారి



నూజివీడు: ఐసీడీఎస్ నూజివీడు సీడీపీఓగా పిల్లి విజయకుమారి నియమితులయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు సీడీపీఓగా పని చేస్తున్న విజయకుమారి నూజివీడు సీడీపీఓగా బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన సీడీపీఓ మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలన్నింటినీ సందర్శించి అవగాహన పెంచుకుంటానన్నారు. గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందేలా చూస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు త్వరలోనే ఇండక్షన్ స్టవ్‌లు, ఎలక్ట్రిక్ కుక్కర్లను అందజేస్తామని తెలిపారు.

హీల్ విద్యార్థుల ర్యాలీ

ఆగిరిపల్లి: పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న చైతన్య యాత్రలో దివ్యాంగులు భాగస్వాములు కావాలని ఆ సంస్థ చైర్మన్ కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన ర్యాలీలో హీల్ సంస్థ అంధ విద్యార్థులు పాల్గొన్నట్లు సంస్థ సీఈఓ అజయ్‌కుమార్ తెలిపారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ



ముసునూరు: విద్యార్థులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర పాఠ్య పుస్తకాలను సమగ్రంగా వినియోగించుకోవాలని ఎంపీపీ కొండా దుర్గాభవాని, పిలుపునిచ్చారు. రమణక్కపేట, గోపవరం జెడ్పీ హైస్కూళ్లలో హెచ్ఎంలు రామకృష్ణారావు, నాగేంద్రరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పాఠ్య పుస్తకాలను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కంచర్ల వాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'సూర్య ఘర్' లక్ష్యాన్ని సాధించాలి



ముసునూరు: ప్రధానమంత్రి సూర్య ఘర్ లక్ష్య సాధనలో అధికారులు భాగస్వామ్యం కావాలని ఎంపీపీ కొండా దుర్గాభవాని సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సత్యనారాయణ అధ్యక్షతన సూర్య ఘర్, యోగా డే కార్యక్రమాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈలు సత్యప్రసాద్, దుర్గా ప్రసాద్, విద్యుత్ సబ్ ఇంజినీర్ కేవీ సుబ్బారావు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

డీడీఓ కార్యాలయ ఏర్పాటుకు భవనాల పరిశీలన


భవనాలను పరిశీలిస్తున్న కృష్ణా జిల్లా జెడ్పీ సీఈఓ కె.కన్నమనాయుడు

నూజివీడు: డీఎల్‌డీఓల పేరును డీడీఓ(డివిజన్ డెవలప్‌మెంట్ అధికారి)గా మార్చడంతో పాటు వారికి అధికారాలను పెంచి డివిజన్ స్థాయిలో సంక్షేమశాఖల కార్యాలయాలన్నింటినీ డీడీఓ పరిధిలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు కృష్ణాజిల్లా జెడ్పీ సీఈఓ కె.కన్నమనాయుడు పేర్కొన్నారు. నూజివీడులో డివిజన్ డెవలప్‌మెంట్ అధికారి కార్యాలయం ఏర్పాటుకుగాను ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న మహిళా సాధికారత భవనం, పాత భవిత సెంటర్ భవనం తదితర వాటిని సీఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీడీఓ కార్యాలయ పరిధిలోకి పంచాయతీరాజ్, ఉపాధి హామీ పథకం ఏపీడీ, డీఎల్‌పీఓ తదితర కార్యాలయాలన్నింటినీ తీసుకు వస్తామన్నారు. ఎంపీడీవోలతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు సంబంధించిన సిబ్బంది డివిజన్ స్థాయిలో డీడీఓ నియంత్రణలో పని చేస్తారన్నారు. రెవెన్యూకు సంబంధించి డివిజన్ స్థాయిలో ఆర్డీఓ ఎలా ఉంటారో, అభివృద్ధికి సంబంధించి డీడీఓ ఉంటారని చెప్పారు. డివిజన్ స్థాయిలో అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయం చేసుకుంటూ సమీక్షలు నిర్వహిస్తారన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్, ఎంపీపీ ఆరేపల్లి శిరీష, డీడీఓ వెంకటరత్నం, పంచాయతీరాజ్ డీఈ కమల్ కిశోర్, ఎంఈఓ–1, 2 ఎం.సేవియా, జమలయ్య, నాయకులు ముసునూరు రాజా, ఆరేపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సాగులో విత్తనాల ఎంపిక కీలకం

చాట్రాయి: వ్యవసాయ సాగులో పంట విత్తనాల ఎంపిక చాలా కీలకమని వ్యవసాయ అధికారి బి.శివశంకర్ తెలిపారు. మండలంలోని నరసింహారావుపాలెంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. ఖరీఫ్ సాగు సమయం వచ్చినందున మేలైన వరి విత్తనాలను ఎంపిక చేసుకొని నారు పోయాలన్నారు. వరి నారు మడిలో కిలో యూరియా, కిలో భాస్వరం, కిలో పొటాష్ తప్పనిసరిగా వాడాలని, పచ్చిరొట్ట పూత దశలో ఉన్నపుడు భూమిలో కలియ దున్నాలని చెప్పారు. విత్తనాలు కొనేటప్పుడు డీలరు వద్ద నుంచి బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.


నరసింహారావుపాలెంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ముసునూరు మండలంలో 'పొలం పిలుస్తోంది'

ముసునూరు: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ముందస్తుగా ప్రారంభం కానున్న దశలో వరి విత్తన ఎంపికలో జాగ్రత్త వహించాలని వ్యవసాయాధికారి ఆలూరి చాముండేశ్వరి రైతులకు సూచించారు. గుళ్లపూడి, వలసపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నకిలీ విత్తనాలను ఎంపిక చేసుకుంటే, పంట దిగుబడులు రాక రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడతారన్నారు. ప్రభుత్వ గుర్తింపు ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. రైతులను మోసగిస్తూ, నకిలీ, నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు చేపట్టి, కేసులు నమోదు చేస్తామని, విత్తన దుకాణదారులను హెచ్చరించారు. జిల్లా డీఆర్‌సీ వ్యవసాయాధికారి ఎం.ఉషా కుమారి విత్తన ఎంపిక, విత్తన శుద్ధి, పచ్చి రొట్ట ఎరువుల వినియోగం, ఉపయోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


గుళ్లపూడి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయాధికారులు

ఉద్యోగ భద్రత కల్పించాలని ధర్నా


కొండపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఉద్యోగ భద్రత కల్పించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. కార్మికులకు సమ్మె కాలంలో ఇచ్చిన కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ తాగునీటి సరఫరా, వీధి దీపాలు, టౌన్ ప్లానింగ్, ఫిట్టర్, కంప్యూటర్ ఆపరేటర్లు తదితర ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనాలు లేక వారి కుటుంబాలు పస్తులు ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరదలు, తుఫాన్‌లు, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో విధులు నిర్వహించినప్పటికీ కనీస వేతనాలు ఇవ్వడం లేదని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20వ తేదీ తర్వాత వారు చేపట్టనున్న సమ్మెకు సంఘీభావం ప్రకటించాలని కోరారు. ధర్నాలో ఇంజినీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

రైతులకు 4 శాతం వడ్డీ రాయితీ చెల్లించాలి

నూజివీడు: బ్యాంకులు, సహకార సంఘాల్లో పంట రుణాలు తీసుకున్న రైతులకు ప్రభుత్వం 4 శాతం వడ్డీ రాయితీ సొమ్మును ప్రభుత్వం వెంటనే చెల్లించాలని రైతు సంఘం సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులు తీసుకునే రుణాలపై రూ.లక్ష వరకు సున్నా వడ్డీని, రూ.3 లక్షల వరకు పావలా వడ్డీని వసూలు చేస్తున్నారన్నారు. 2019 వరకు సహకార సంఘాల్లో 7 శాతం వడ్డీని రుణాలు తీసుకున్న రైతులు చెల్లించకపోయినా సర్దుబాటు చేసి ప్రభుత్వం విడుదల చేసినప్పుడు వాటికి జమ చేసేవారని చెప్పారు. 2019 నుంచి రైతుల వద్ద వడ్డీని వసూలు చేసి అనంతరం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 3 శాతం, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే 4 శాతం వడ్డీ సొమ్మును రైతులకు చెల్లించేవారన్నారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కేంద్రం 3 శాతం వడ్డీ రాయితీ సొమ్మును విడుదల చేసినప్పటికీ పీఏసీఎస్‌లలో నేటికీ రైతులకు ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన 4 శాతం వడ్డీ రాయితీ సొమ్మును రైతులకు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. రైతులకు ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రాయితీ సొమ్మును విడుదల చేయకపోవడం శోచనీయమని పేర్కొన్నారు.

యోగా దినోత్సవం విజయవంతం చేయాలి

తిరువూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కె.మాధురి కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బుధవారం రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, మెప్మా అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రతి అధికారి పాల్గొనాలని చెప్పారు.

46 ఆర్టీసీ బస్సుల కేటాయింపు

విశాఖపట్నంలో 21న జరిగే యోగా దినోత్సవానికి తిరువూరు ఆర్టీసీ డిపో నుంచి 46 బస్సులను కేటాయించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. గురువారం ఈ బస్సులను విజయనగరం రీజియన్‌కు పంపుతామని, యోగా దినోత్సవం అనంతరం ఆదివారం తిరిగి ఈ బస్సులు డిపోకు చేరతాయని తెలిపారు. ఈ కారణంగా తిరువూరు డిపో నుంచి నిర్వహించే పలు రూట్లలో బస్సు సర్వీసులను రద్దు చేయనున్నట్లు వెల్లడించారు.